రంజాన్ పండుగ సందర్భంగా ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ హోం మంత్రి మహమూద్ అలీ

రంజాన్ పండుగ సందర్భంగా ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన బాల్య మిత్రుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహమ్మద్ జహంగీర్

రంజాన్ వేడుకల్లో కేటీఆర్

మాజీ మంత్రి మహమూద్ అలీ ఇంట్లో లంచ్

మలక్ పేట, మార్చి 31: రంజాన్ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. మలక్‌పేట పరిధిలోని ఆజంపురాలో మాజీ మంత్రి మహమూద్ అలీ నివాసానికి వెళ్లిన ఆయన అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ నేత, మహమూద్ అలీ తనయుడు ఆజం అలీ, ఇతర కుటుంబసభ్యులతో మాట్లాడి యోగాక్షేమాలు తెలుసుకున్నారు. మరోవైపు కేటీఆర్ రాకతో ఆజంపురాలో సందడి నెలకొన్నది. ఆయన రాక విషయాన్ని ముందే తెలుసుకున్న కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వీరిలో బీఆర్ఎస్ నాయకులు భూమేశ్వర్, తేళ్ల మహేష్ కుమార్, పగిళ్ల నర్సింగ్, రాము, లాయక్ అలీ, బాబు సుదర్శన్, రఘునందన్ రెడ్డి, కామేశ్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సల్మాన్, లలిత తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి దుర్మార్గమెందుకు?

భూ రక్షణ పోరాటంపై రేవంత్ సర్కారు దుశ్శాసన పర్వం

ఇక్కడి నెమళ్ల ఆర్తనాదాలు రాహుల్‌కు వినిపించడం లేదా?

ముంబై, ఛత్తీస్‌గఢ్ అడవులపై గగ్గోలు పెట్టిన రాహుల్‌కు పశ్చిమ హైదరాబాద్ భవిష్యత్తు నాశనమైనా ఫర్వాలేదా?'

పూర్వ విద్యార్థులు భట్టి, శ్రీధర్ బాబు ఎందుకు మాట్లాడరు?

విద్యార్థుల తెగువకు సెల్యూట్ ఉద్యమానికి అండగా ఉంటం: కేటీఆర్ భరోసా

తెలంగాణ భవన్‌లో తనను కలిసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటంపై రేవంత్‌రెడ్డి సర్కారు దుర్మార్గంగా వ్యవరిస్తున్నదని, దుశ్శాసన పర్వం కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. సోమవారం తెలంగాణ భవన్‌లో తనను కలిసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి అండగా ఉంటామని కేటీఆర్ భరోసానిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూముల పరిరక్షణ కోసం ఆందోళన చేస్తున్న ఆడబిడ్డలను లాగి పడేసి దుస్తులను చించి దౌర్జన్యం చేయడం ఏమిటని నిలదీశారు. 1968-71 వరకు జరిగిన తొలిదశ తెలంగాణ ఉద్యమంలో 370 మంది ఆత్మబలిదానాల సాక్షిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పడిందని గుర్తుచేశారు. యూనివర్సిటీ విద్యార్థులపై, భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం దాష్టీకం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

> ప్రజాస్వామిక స్ఫూర్తి, సామాజిక స్పృహ ఉన్న ఎవరికైనా హెచ్‌సీయూలో జరుగుతున్న పరిణామాల పట్ల బాధ కలుగుతుంది. హెచ్‌సీయూ విద్యార్థులు ఎలాంటి స్వార్థం లేకుండా సమాజహితం కోసం గొప్ప పోరాటం చేస్తున్నరు. కొత్త తరం విద్యార్థుల్లో పోరాట పటిమ స్ఫూర్తిదాయకం. విద్యార్థులు చూపుతున్న ఈ తెగువకు సెల్యూట్ చేస్తున్నా. - కేటీఆర్

రాష్ట్ర ప్రభుత్వం వందల బుల్డోజర్లను, హిటాచి యంత్రాలను, పోలీసులను పెట్టి అక్కడున్న చెట్లను నరికేసి.. జంతువులను తరిమేసి, అక్కడ ఏమీ లేని బంజరు భూమి అని చెప్పేందుకు ఎందుకు ఆరాట పడుతున్నదని ప్రశ్నించారు. 'గచ్చిబౌలి, నానక్‌రామ్ గూడ, ఖాజాగూడ, కోకాపేట వరకు నగరం కాంక్రీట్ జంగల్‌లా మారింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏరియాలో నగరం విస్తృతంగా పెరిగింది. దేశంలోని ఏ నగరంలోనూ ఇంత తక్కువ విస్తీర్ణంలో భారీగా నగరం అభివృద్ధి చెందలేదు. కోట్లాది చదరపు అడుగుల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి' అని వివరించారు. పశ్చిమ హైదరాబాద్‌కు ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పశ్చిమ హైదరాబాదులో భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. సెంట్రల్ యూనివర్సిటీ చుట్టూ ఉన్న హరితాన్ని అలాగే ఉంచితే భవిష్యత్తుకు కొంత భరోసా ఉంటుందని పేర్కొన్నారు. ఒక ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అనేది చేయకుండా ఏ విధంగా ఈ 400 ఎకరాలను అమ్ముతారని విద్యార్థులు అడుగుతున్నారని వివరించారు. 400 ఎకరాలను అమ్మేముందు జరిగే పర్యావరణ నష్టంపై అధ్యయనం చేయాలని అడుగుతున్నారని చెప్పారు. 2003లో ఐఎంజీ భారత్ అనే కంపెనీకి క్రీడా సదుపాయాల కోసం ఈ 400 ఎకరాలను కేటాయించిందని వ్యాఖ్యానించారు. కేవలం స్టేడియాలు, కీడా శిక్షణకు సంబంధించిన మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వాలు భూములను ఆ సంస్థకు ఇచ్చినట్టు గుర్తుచేశారు. కానీ ఈ ప్రభుత్వం అదే ప్రాంతంలో 400 ఎకరాల్లో కోట్లాది చదరపు అడుగుల నిర్మాణాలు చేపట్టి కాంక్రీట్ జంగల్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. 21 ఏండ్ల తర్వాత ఈ భూములపై తీర్పు వచ్చిందని వెల్లడించారు. కానీ ప్రభుత్వం మాత్రం వెంటనే ఆ భూములను అమ్మి రూ.30 వేల కోట్లు సేకరించాలని ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. 'ఆస్తులు అమ్మడం.. అప్పులు తేవడం అనే రేవంత్‌రెడ్డి ఎజెండా తప్పా? ఒప్పా? అనేది ప్రజలే నిర్ణయిస్తారు' అని పేర్కొన్నారు.

400 ఎకరాలపైనే ఎందుకు కన్ను?

ఫ్యూచర్ సిటీని 50 వేల ఎకరాల్లో కడతామని సీఎం రేవంత్‌రెడ్డి ఓ వైపు ప్రచారం చేసుకుంటున్నారని, ఇప్పటికే 15 వేల ఎకరాల భూమి ఉన్నదని, మరో 35 వేల ఎకరాలను సేకరిస్తామని ఊదరగొడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఫార్మాసిటీ భూములతో పాటు మరో 30 వేల ఎకరాలను సేకరించి కొత్త నగరం కడతామంటున్నారని, ప్రభుత్వం వద్ద 15 వేల ఎకరాలు ఉంటే హెచ్‌సీయూలోని 400 ఎకరాలపై ఎందుకు కన్ను పడిందో చెప్పాలని నిలదీశారు. వరుసగా 4 రోజులు కోర్టుకు సెలవులని తెలిసే బుల్డోజర్లు, పోలీసులతో దౌర్జన్యానికి తెగ బడ్డారని నిప్పులు చెరిగారు.

రాహుల్‌కు సూటి ప్రశ్నలు

హెచ్‌సీయూలో బుల్డోజర్లతో అర్ధరాత్రి చేస్తున్న పనులకు నెమళ్లు, పక్షులు అరుస్తున్న విజువల్స్ రాహుల్‌గాంధీకి కనిపించడం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైకోర్టులో ఇప్పటికే ఈ అంశంపై ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశామని, హైకోర్టు ఆదేశాలు రాకముందే ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తున్నా రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. 'ఇదే రాహుల్ గాంధీ గతంలో ముంబై మహానగరంలోని ఆరే అడవుల్లో 800 ఎకరాల్లో 2,500 చెట్లు కొట్టేస్తే నగరం కాంక్రీట్ జంగల్‌గా మారుతుందన్నరు.. ఛత్తీస్‌గఢ్‌లో హస్దియో అడవులను అక్కడి బీజేపీ ప్రభుత్వం మైనింగ్‌కు కేటాయిస్తే.. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని గగ్గోలు పెట్టింద్రు. మరి నేడు హెచ్‌సీయూ విద్యార్థులు, పశ్చిమ హైదరాబాద్ భవిష్యత్తు నాశనమైనా రాహుల్‌కు ఫర్వాలేదా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములపై చేస్తున్న రాజకీయంతో ఇబ్బందులు పడుతున్న పిల్లలు, పర్యావరణం, వన్యప్రాణుల రోదనలు రాహుల్ గాంధీకి వినిపించడం లేదా అని నిలదీశారు. బీఆర్ఎస్ తరపున రాజ్యసభలో ఈ అంశంపై కేంద్రాన్ని నిలదీస్తామని చెప్పారు. కేంద్ర హెచ్ఆర్డీ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఈ అంశంపై అడుగుతామని తెలిపారు.

విద్యార్థులకు అండగా ఉంటాం

హెచ్‌సీయూ విద్యార్థులకు అండగా ఉంటామని కేటీఆర్ భరోసానిచ్చారు. 'రేవంత్‌రెడ్డి అంటే రియల్ ఎస్టేట్.. రియల్ ఎస్టేట్ అంటే రేవంత్ రెడ్డి' అని ఎన్నికల ముందే చెప్పినప్పుడే మనం జాగ్రత్త పడాల్సిందని చెప్పారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫుట్‌బాల్ ఆడి మరీ అక్కడున్న భూములపై కన్నేశాడని విమర్శించారు. అందుకే పిల్లలు, పర్యావరణం, సెంట్రల్ యూనివర్సిటీ ఏమైనా సరే ఆ భూములు వదిలిపెట్టనని ఈ రోజు అరాచకంగా వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమను సెంట్రల్ యూనివర్సిటీకి రావాలని అనేకమంది అడుగుతున్నారని, విద్యార్థుల ఆందోళనకు రాజకీయ రంగు పులుముతాడనే తాము ఇప్పటిదాకా నేరుగా హెచ్‌సీయూకు వెళ్లలేదని వివరించారు. విద్యార్థుల ఆందోళనలను సైతం మలినం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతారని.. సరైన వేదికలపైన ఈ అంశాన్ని లేవనెత్తుతామని స్పష్టంచేశారు. ప్రభుత్వ ఆస్తులు అమ్ముకుంటే భవిష్యత్తు తరాల కోసం స్మశానాలకు కూడా జాగాలు ఉండవని చెప్పింది రేవంత్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. మరిప్పుడు రేవంత్ అవన్నీ మర్చిపోయాడా? అని నిలదీశారు. ఇద్దరు యూనివర్సిటీ పిల్లలను జైలుకు పంపారని విద్యార్థులు చెప్తున్నారని, వారికి అండగా ఉంటామని, న్యాయపరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆ ఇద్దరు విద్యార్థుల ఆచూకీని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

> హెచ్‌సీయూలో బుల్డోజర్లతో అర్ధరాత్రి చేపడుతున్న పనులకు నెమళ్లు, పక్షులు అరుస్తున్న విజువల్స్ రాహుల్‌గాంధీకి కనిపించడం లేదా? ఇప్పటికే ఈ అంశంపైన పర్యావరణ హితం కోసం హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసినం. ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలకంటే ముందే అరాచకంగా వ్యవహరిస్తున్నది. గతంలో సెంట్రల్ యూనివర్సిటీకి రెండుసార్లు వచ్చి వెళ్లిన రాహుల్ గాంధీ, విద్యార్థులపై ఇంత అరాచకం జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదు? -కేటీఆర్

భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు ఎందుకు మాట్లాడరు?

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు లాంటి వాళ్లు ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. వారికి పిల్లల తరపున నిలబడేందుకు మనసు రావడం లేదని వాపోయారు. ప్రభుత్వంలో ఉన్న వారు ఏకపక్షంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు. వైస్ చాన్సలర్ అనుమతులు లేకుండా పోలీసులు వర్సిటీలోనికి వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోకి వెళ్లే అనుమతి పోలీసులకు ఉండదని, కానీ విచ్చలవిడిగా పోలీసులను పంపించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నాడని మండిపడ్డారు. అరెస్ట్ చేసిన రోహిత్, నవీన్ కుమార్‌పై పెట్టిన కేసులు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు దుష్పరిణామాలను దృష్టిలో ఉంచుకోకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల విషయంలో అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. హెచ్‌సీయూ అంశంలో బీజేపీ, కమ్యూనిస్టులతో పాటు ఇతర పార్టీలు తమ స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు.

భూములు అమ్ముకుంటే పాలించలేరా?

- విద్యార్థినులను ఈడ్చుకెళ్లి చితకబాదుతరా : బండి సంజయ్
- హెచ్‌సీయూ రాష్ట్రానికే తలమానికం : ఈటల రాజేందర్
- ప్రభుత్వం పునరాలోచన చేయాలి : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తున్నాం : జాన్‌వెస్లీ

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : భూములను అమ్ముకుంటే రాష్ట్రాన్ని పాలించే పరిస్థితి లేదా? భూములను అమ్మి వేల కోట్లు దండుకోవడమే మీ పనా? అని కేంద్ర మంత్రి బండి సంజయ్ రేవంత్ సర్కారును ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రక్షించేందుకు ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల రక్షణ కోసం విద్యార్థులు ఆందోళనకు దిగితే వారిని గొడ్డును బాదినట్టు బాదుతరా? అని ప్రశ్నించారు. అమ్మాయిలని కూడా చూడకుండా జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లి కొడతరా? ముఖ్యమంత్రి మానవత్వం లేదా? అని మండిపడ్డారు. విద్యార్థులపై పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రాష్ట్రానికే తలమానికం అని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూ భూములు అమ్మి అప్పులు కట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలుపుతున్నట్టు ప్రకటించారు. హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. వర్సిటీ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్బంధానికి నిరసనగా మంగళవారం హెచ్‌సీయూ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు.

వర్సిటీ భూముల అమ్మకం హేయం

మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకంపై మావోయిస్టు పార్టీ స్పందించింది. యూనివర్సిటీలో మునుపెన్నడూ లేనివిధంగా భూముల విక్రయంపై పార్టీ అధికార ప్రతినిధి జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 32వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టబద్ధత కల్పించిన సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెట్టడం అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రశ్నించే గొంతులను నొక్కేయడం సరికాదన్నారు.

ఓయూలో ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలి

ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేయకూడదని మార్చి 13న ప్రభుత్వం విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక లేఖ విడుదల చేశారు. ప్రజావ్యతిరేక, బూర్జువా అనుకూల ఆంక్షలను ఎత్తివేసే వరకు విద్యార్థులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకించిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరికలు జారీ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పేర్కొన్నారు.

ఆ భూములు హెచ్‌సీయూవే!

- సెల్ఫ్‌గోల్ చేసుకున్న కాంగ్రెస్ సర్కారు
- 400 ఎకరాలకు బదులు గోపన్‌పల్లి తండాలో 397 ఎకరాలు ఇచ్చినట్టు లీకులు
- చంద్రబాబు హయాంలో ప్రైవేట్‌కు అప్పగింత
- అవి యూనివర్సిటీ భూములు కాకుంటే వేరే చోట ఎలా ఇచ్చారని విద్యావేత్తల ప్రశ్నలు

హైదరాబాద్ సిటీ బ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాలను హెచ్‌సీయూకు చెందకుండా చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. కానీ నిజం ఎన్నటికీ అబద్ధం కాలేదనే సత్యాన్ని గ్రహించలేకపోతున్నది. ఈ 400 ఎకరాలకు బదులు గోపన్‌పల్లి తండాలో 2004లోనే 397 ఎకరాలు కేటాయించినట్టు పాత డాక్యుమెంట్లను సోషల్ మీడియాలో లీక్ చేసి సెల్ఫ్‌గోల్ చేసుకున్నది. ఆ 400 ఎకరాలు హెచ్‌సీయూవి కాబట్టే మరోచోట భూములను కేటాయించారనే విషయాన్ని గుర్తించలేకపోయింది. హెచ్‌సీయూలో టీజీఐఐసీ అధికారికంగా సర్వే చేపట్టలేదని, వారి ప్రకటన పూర్తిగా అబద్ధమని స్వయంగా రిజిస్ట్రార్ ప్రకటించడంతో సర్కారు తీరు బట్టబయలైంది. ఆ భూములు హెచ్‌సీయూవే అనేందుకు సాక్ష్యాలు కళ్లముందు ఉన్నాయి.

నాడే విద్యార్థుల ఆందోళన

కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల హెచ్‌సీయూ భూములను నాటి చంద్రబాబు ప్రభుత్వం 2003లో ఐఎంజీ భారత్‌కు కేటాయించింది. యూనివర్సిటీ భూములను ప్రైవేట్ సంస్థకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ విభాగం, విద్యార్థులు ఉధృతంగా ఆందోళనలు చేపట్టారు. తమ యూనివర్సిటీ భూములను ప్రైవేట్ సంస్థకు ఎలా అప్పగిస్తారని పోరాటం చేశారు.

దిగొచ్చిన బాబు సర్కారు

విద్యార్థుల ఆందోళనలకు దిగొచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఈ భూములకు బదులుగా 2004 జనవరిలో గోపన్‌పల్లిలో 397 ఎకరాల భూమిని కేటాయించింది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూముల్లో 200 ఎకరాలను కేంద్ర సంస్థలైన టాటా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫండమెంటల్ రీసెర్చ్‌కు, మరో 100 ఎకరాలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ యానిమల్ బయోటెక్నాలజీకి అప్పగించింది. మరి ఆ 400 ఎకరాల భూమి యూనివర్సిటీకి చెందినది కాకుంటే.. మరోచోట ప్రభుత్వ భూములను ఎందుకు కేటాయించారు? అవి ప్రభుత్వ భూములే అయితే స్వాధీనం చేసుకున్న వాటి స్థానంలో వేరేచోట భూములు ఇవ్వాల్సిన అవసరం ఏమున్నది? స్వాధీనం చేసుకున్న భూములకు బదులు మరోచోట కేటాయించారంటే.. ఆ 400 ఎకరాలు వర్సిటీవేనని ప్రభుత్వం అంగీకరించినట్టే కదా? కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములన్నీ తమవేనని బుకాయించడంపై మేధావులు, నిపుణులు తప్పుపడుతున్నారు.

మష్రూమ్ రాక్స్ వేదికగానే ప్రోగ్రాంలు

ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన భూముల్లో ఉన్న ఐకానిక్ మష్రూమ్ రాక్సే హెచ్‌సీయూ ఏర్పడిననాటి నుంచి చిహ్నంగా వాడుతున్నారు. క్యాంపస్‌లో ఏకార్యక్రమాన్ని అయినా మష్రూమ్ రాక్స్ వేదికగానే విద్యార్థులు నిర్వహిస్తున్నారు. ఈప్రాంతం పర్యాటక ప్రాంతంగానూ విరాజిల్లుతున్నది. తెలంగాణలోనూ ఇలాంటి మష్రూమ్ రాక్స్ మరెక్కడా లేవు. అటువంటి వారసత్వ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించి.. విచ్ఛిన్నం చేయడాన్ని చరిత్రకారులు సైతం వ్యతిరేకిస్తున్నారు. వారసత్వ సంపదను సంరక్షించాల్సిన ప్రభుత్వమే విచ్ఛిన్నం చేసి మన చరిత్రను కనుమరుగు చేయడం సీఎం రేవంత్ తెలివితక్కువతనానికి నిదర్శనమని చరిత్రకారులు మండిపడుతున్నారు.

వర్సిటీ పేరిట గుంట భూమి ఉండదా?

హెచ్‌సీయూను ఏర్పాటు చేస్తూ నాడు ప్రధాని ఇందిరాగాంధీ కంచె గచ్చిబౌలిలోని 2,253 ఎకరాలను కేటాయించారు. వర్సిటీకి కేటాయించినవి ప్రభుత్వ భూములే కాబట్టి రిజిస్ట్రేషన్ అంశాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. టీజీఐఐసీ చెప్తున్నట్టు ఆ భూములన్నీ ప్రభుత్వానివే అయితే మరి యూనివర్సిటీకి ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయో చూపించాలి కదా? యూనివర్సిటీ ఏర్పడిన నాటి నుంచి 70 ఏండ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉన్నది. ఇన్నాళ్లుగా యూనివర్సిటీ పేరిట ఒక్క గుంట భూమి కూడా ఎందుకు రిజిస్ట్రేషన్ చేయలేదు? ఇలా స్వాధీనం చేసుకుంటూ పోతే యూనివర్సిటీకి భవిష్యత్తు ఉంటుందా? కాంగ్రెస్ సర్కారు నిర్ణయంతో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు ఇదే దుస్థితి వస్తుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. యూనివర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయకపోవడాన్నే సీఎం రేవంత్ ఆసరాగా తీసుకుని ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నాడని విద్యార్థులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు.

హెచ్‌సీయూ వద్ద రేవంత్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థులు

లీకుల వెనుక మర్మమేంటి?

హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాలకు బదులు గోపన్‌పల్లిలో 397 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించినట్టు పాత డాక్యుమెంట్ ను సోషల్ మీడియాలో లీక్ చేశారు. డాక్యుమెంట్ ప్రకారం 2004లోనే 400 ఎకరాలకు బదులు వేరే ప్రాంతంలో భూమి ఇచ్చారని.. ఇక హెచ్‌సీయూ భూములు ప్రభుత్వానికే చెందుతాయని సోషల్ మీడియాలో కొన్ని వార్తలను సర్క్యులేట్ చేస్తున్నారు. 2004 జనవరి 31న గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 36లో 191.36 ఎకరాలు, సర్వేనంబర్ 37లో 205.20 గుంటల భూమిని హెచ్‌సీయూకు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఆ భూములను వెంటనే టాటా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫండమెంటల్ రీసెర్చ్‌కు, మరో 100 ఎకరాలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ యానిమల్ బయోటెక్నాలజీ అప్పగించారు. 400 ఎకరాలు హెచ్‌సీయూకే చెందుతాయనేది తేటతెల్లమవుతున్నది.

టీజీఐఐసీ ప్రకటన పచ్చి అబద్ధం

- హెచ్‌సీయూలో సర్వే జరగలేదు
- భూముల హద్దుల నిర్ణయానికి వర్సిటీ అంగీకరించలేదు
- వేలం ఆపేసి జీవవైవిధ్యాన్ని కాపాడండి: రిజిస్ట్రార్
- ఆ 400 ఎకరాలు ప్రభుత్వానివే
- ఆ భూమిలో చెరువులు లేవు, జీవ వైవిధ్యం లేదు: ప్రభుత్వం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములు తమవేనని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడాన్ని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ తీవ్రంగా ఖండించారు. వేలం విషయంలో టీజీఐఐసీ ప్రకటన పూర్తిగా అవాస్తవమని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆ భూముల్లో ఎలాంటి సర్వే చేపట్టలేదని, భూబదలాయింపునకు తాము అంగీకరించలేదని స్పష్టంచేశారు. ఆ భూముల విషయంలో యూనివర్సిటీ నుంచి ప్రభుత్వం, టీజీఐఐసీ ఎలాంటి అనుమతులు, అంగీకారం తీసుకోలేదని వెల్లడించారు. యూనివర్సిటీ భూములను బదలాయించాలంటే, యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం పొందాలని స్పష్టంచేశారు. యూనివర్సిటీ పరిధిలోని భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, ఇక్కడి పర్యావరణం, జీవవైవిధ్యాన్ని సంరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. 400 ఎకరాల భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి యూనివర్సిటీ అంగీకరించిందనే అసత్య వార్తలను ప్రచారం చేయొద్దని కోరారు.

భూముల వేలాన్ని సమర్థించుకుంటున్న సర్కార్

హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల భూములను వేలం వేయడం సరైన నిర్ణయమేనని కాంగ్రెస్ సర్కార్ సమర్థించుకున్నది. ఆ భూములు తమకే చెందుతాయని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. 2004లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రైవేట్ సంస్థకు ఆ భూమిని కేటాయించగా, సుప్రీంకోర్టులో ఉన్న కేసును గెలవడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం యాజమాన్య హక్కులను దక్కించుకున్నదని స్పష్టం చేసింది. ఆ భూమికి సంబంధించి సృష్టించే ఏ వివాదమైనా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని హెచ్చరించింది. 400 ఎకరాల భూముల్లో ఎలాంటి చెరువులు, జీవవైవిధ్యం లేదని మరోసారి పేర్కొన్నది.

భూమి స్వాధీనానికి మేం అంగీకరించలేదు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూమి విషయంలో టీజీఐఐసీ విడుదల చేసిన ప్రకటనలో ఎలాంటి నిజం లేదు. 2024 జూలైలో యూనివర్సిటీ పరిధిలో ఎలాంటి సర్వే జరగలేదు. ఇప్పటివరకు కేవలం ప్రాథమిక పరిశీలన మాత్రమే చేపట్టారు. భూమి హద్దుల నిర్ణయానికి మేం అంగీకరించలేదు. యూనివర్సిటీ పరిధిలోని భూములను బదలాయించాలంటే, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం ఉండాలి. యూనివర్సిటీ పరిధిలోని భూముల పర్యావరణం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. -హెచ్‌సీయూ రిజిస్ట్రార్

ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే

హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే. ఆ భూమికి యజమాని తానేనని తెలంగాణ ప్రభుత్వం నిరూపించుకున్నది. 21 ఏండ్ల క్రితం ప్రైవేట్ సంస్థకు కేటాయించిన భూమిని న్యాయపోరాటం ద్వారా ప్రభుత్వం దక్కించుకున్నది. ప్రభుత్వం వేలం వేసే భూమిలో ఉన్న రాళ్లు, పర్యావరణం, జీవవైవిధ్యానికి ఎలాంటి విఘాతం కలగనివ్వం. భూముల వేలాన్ని వ్యతిరేకించేవారంతా రాజకీయ నాయకుల, స్థిరాస్తి వ్యాపారుల ప్రయోజనాలకు అనుకూలంగా విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు. -రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన